



వార్తా పత్రికలూ, ఆకాశవాణీ మనకి వార్తల్ని అందజేసే ప్రముఖ సాధనాలు. ఇక్కడమాట అక్కడ, అక్కడి విషయం ఇక్కడా చేరవేసే మనుషుల వల్లకూడా మనం వార్తల్ని తెలుసుకుంటాం. ఆ జాతి వ్యక్తుల స్వచ్ఛంద సేవకి చేతులెత్తి మొక్కాలి. పత్రికలూ, ఆకాశవాణీ, కొందరు వ్యక్తులూ వార్తా సౌకర్యాలు కలిగిస్తున్నారని మనం అంగీకరిస్తే ఆ లిస్టులో గోడలను కూడా చేర్చుకోవాలని నేను మనవి చేస్తున్నాను. గోడ కూడా వార్తలను, వ్యాఖ్యలను ఎప్పటి కప్పుడు అందిస్తూనే వుంటుంది. ఖర్చు తక్కువ పని. కాగితం కొనక్కరలేదు. ప్రెస్‌తో పనిలేదు. రంగూ, కుంచె వుంటే చాలు. అర్జంటుగా రాసేయాలనుకుంటే బొగ్గు వుండనే వుంది.

గోడని మొట్టమొదటి సారిగా ఎవడు కట్టాడోగాని ఆ మహానుభావుడు వార్తలను అందించే వుద్దేశ్యంతో గోడకట్టి వుండడని డవుటు. ఇల్లు ఎంతో వైభవముగా వుండొచ్చు. దాని చుట్టూతా గోడవుంటేనే కాని ఆ వైభవము రాణించదు. ఇంటికి గోడ అందమన్నారందుకే. అందం అట్లా వుంచండి. గోడ హద్దుగా గూడా పనిచేస్తుంది. ఉత్తరాన ఇంతస్థలమూ దక్షిణాన ఇంతా అని కాగితాల్లో రాసుకుంటే రాసుకోవచ్చు. కాగితాలు ఎవడు చూడొచ్చేడు. గోడని చూడగానే హద్దులేవిటో కొత్తవాడికి కూడా సుళువుగా అర్థమైపోతాయి. మొదటి గోడ నిర్మాత హద్దునీ, అందాన్ని దృష్టిలో వుంచుకుని గోడ నిర్మించేడని నేను అనుకుంటున్నాను. ఇళ్ళకేకాదు దేశాలకు కూడా గోడలు కట్టేసుకుంటే—ముందు తరాల వారికి తలనొప్పి తగ్గుతుందని నా ఉద్దేశ్యం. జర్మనీలో ఆ జాగ్రత్త పడ్డారు. చైనాలో కూడా గోడ వుందని చదివేనే కాని అది అందానికో హద్దుకో నాకు గుర్తు లేదు. వదిలేయండి.

ఏ వూరి గోడలు ఆ వూరి గొడవలు చెబుతాయని నేనో సామెత ఖాయం చేస్తున్నాను. విజ్ఞులు అంగీకరిస్తారో ఛీ పొమ్మంటారో తెలీదు. చాలా దూరదృష్టితో ఈ సామెతను తయారు చేసేనని మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. ఊరనగానే కొన్ని ఇళ్ళూ, కాలేజీలూ హాస్పిటళ్ళూ వగైరా విశేషాలు చాలా వుంటాయి. రూలు ప్రకారం మెజారిటీని పాటిస్తూ వాటికి గోడలుంటాయి. గోడలున్నాయి గనుక వాటి మీద రాతలుంటాయి. ఊరి చరిత్ర చెప్పడానికి ఆ రాతలు చాలు. మీరు మా వూరు వచ్చేరో లేదో యీ తడవ వచ్చినప్పుడు మీ క్కనిపించే గోడల్ని శ్రద్ధగా పరిశీలించండి. ఫలానా వారికే మీ ఓటని రంగుల్తో (ఇప్పుడు సీజను కాదు గనుక బహుశా క్రితం ఎన్నికల సంగ్రామం తాలూకు మాసిపోయిన అక్షరాలు) రాసి వుంటాయి. వారంతాకూడా మా ఊరి పెద్దలు. అట్లాగే కొందర్ని బండబూతులు తిడుతూ కొన్ని రాతలు కనిపిస్తాయి. వాళ్ళు పాపం గొడవల్లో చిక్కుకున్న ప్రముఖులు. కుస్తీ పోటీలూ, సమ్మెలూ, సత్యాగ్రహాలూ వాటి తేదీలూ, ఆమరణ నిరాహారదీక్షలూ, ఆ కంపెనీలూ, నాటక పోటీలూ వాటి స్థలాలూ, స్థానిక అధికారుల నిరంకుశపాలన, వాటి వివరాలు ఇట్లాగ చదువుకుంటూపోతే మా ఊరి గురించి తొంభై శాతం మీకై మీరే తెలుసుకుంటారు. ఇప్పుడు

చెప్పండి. ఊరి గోడలు ఊరి గొడవలకు నిలువుటద్దాలని నేనంటే మీరు అంగీకరించరా?

కాలేజీ గోడలమీద రాతలు ఎక్కువగా విద్యార్థులు, వాళ్ళ ప్రేమాయణాలకే విలువ నిస్తుంటాయి. ఫలానా వెంకట సుబ్బారావు ప్రేమలోపడి ఫలానా వెంకటలక్ష్మికి బాడీగార్డు ఉద్యోగంలో చేరాడని వుంటుంది. సత్యవతికి, సీతాపతికి ఎల్లాంటి సంబంధమో సచిత్ర రూపంలో వివరించబడి వుంటుంది. బొమ్మలు చూడ్డానికి మనసు బాధపడితే బొమ్మల్ని వదిలి ఎంచక్కా అక్షరాలు చదువుకోవచ్చు. పిల్లకాయల ప్రేమాయణాలే అయితే ఇక్కడో సదాచారాన్ని మనం గమనించాలి. ఏ మేష్టార్నీ సొంత పేరుతో గాలి తీయరు. వాళ్ళకి ముద్దు పేర్లు పెట్టి ముచ్చట తీర్చుకుంటారు. దోసకాయ డవున్, డవునని రాస్తారు. గండుపిల్లి ఖబడ్దార్ అని బెదిరిస్తారు. ముంత కింత పప్పు మురదా బాదంటారు. బిరుదు ప్రదానం బహుహుందాగా వుండడం వల్ల సొంత దాళ్లెవరో ఊరికి కొత్త గనుక తమకి తెలియకపోవచ్చు. కాలేజి ముందే బడ్డీకొట్టు వుంటుంది. అక్కడ ఎవడో ఒక స్టూడెంట్ సిగరెట్ దమ్ము లాగుతూనే వుంటాడు. దోసకాయ ఎవరో, గండుపిల్లి ఎవరో, ముంతకింద పప్పు అడ్రసేమిటో అతన్ని అడిగితే అన్ని వివరాలూ చెబుతాడు. ఏమాట కామాటే చెప్పుకోవాలి. చదువులెట్లా అఘోరిస్తున్నా గోడ కవిత్వంలో కుర్రాళ్ళు చాకుల్లా తయారవుతున్నందుకు మనం సంతోషించాలి. అసలు నన్నడుగుతే భాషలో కొత్త కొత్త ప్రయోగాలు ముందుర గోడలమీదే జరుగుతుందని చెబుతాను. హాస్పిటల్ గోడలు కొంచెం బీభత్సంగానే వుంటాయని మీరు అంగీకరించాలి. గుప్త శృంగారాలు, బూతు కవిత్వంతో ఆ గోడలమీద కెక్కుతాయి. నర్సులూ, డాక్టర్లూ అవన్నీ "ఏ" సర్టిఫికెట్ గోడలు. సెన్సారువారు చూస్తే బుల్‌డ్రోజర్లు పిలిపించి గోడల్ని సమూలంగా పడగొట్టిం చేస్తారు. కనుక ఈ విషయం ఇక్కడొద్దు.

పూర్వకాలంలో పేపర్లు ఇంత ముమ్మరంగా లేవు. ఏ రోజు వార్తలు ఆ రోజు గోడల మీదనే రాసేవారని వెనకటి తరం వాళ్ళు యిప్పటికీ చెబుతూనే వున్నారు. అందుచేత గోడలమీద రాసే ఆచారం చాలా పాతదని మనం అర్థం చేసుకోవాలి. ప్రస్తుతం చైనాలో వార్తల కోసం గోడల్నే

సమ్మెకుంటారని వార్త. వదిలేయండి. ఊళ్ళో గొడవలతోపాటు కొన్ని జాతీయ, అంతర్జాతీయ సమస్యలు కూడా గోడలమీద కెక్కడం నాకు ఎంతో ఆనందంగా వుంటుంది. వియత్నాం వీరులనీ, చైనాకి జై అని, కాంబోడియా కంపూచియా, ఇల్లాగ ఎన్నెన్నో మహత్తరమయిన విషయాలు గోడలు చెప్పినట్లు పేపర్లు చెప్పవు. కొందరు అనుకూలంగా రాస్తే, మరికొందరు ఆ ప్రక్కనే ప్రతికూలంగా రాస్తారు. గోడ చర్చా వేదికవుతుంది. మధ్యమధ్యలో ఫలానా పాదరక్షణలే వాడండని చెప్పుల ప్రకటనా, ఫలానా పళ్ళపొడినే వాడి ఆరోగ్యాన్ని కాపాడుకోండనే హెచ్చరికలూ వుండనే వుంటాయి. ఎక్కడ వియత్నాం, ఎక్కడ పళ్ళపొడి....గోడలకి అల్లాంటి పట్టింపులేమీ వుండవు. గోడ నా ఆదర్శమని ఖండకావ్యం రాద్దామనుకుంటున్నాను. కాలం అనుకూలించాలి మరి!

గోడమీద రాతలు అన్నీ అందంగా వుంటాయని హామీ యివ్వలేను. ముద్దుగొలిపే ముత్యాల్లాంటి అక్షరాలతో పాటు వంకర టింకర కంగాళీ రాతలు కూడా నా దృష్టికి వచ్చేయి. స్పెల్లింగు తప్పులు సరేసరి. వత్తులూ, గుణింతాలూ వదిలేసి వాక్యాన్ని ఖైమా చేసేస్తారు. అల్లాంటి రాతలు చదువుతున్నప్పుడు నాకెంతో బాధగా వుంటుంది. చెప్పదలుచుకున్న పాయింటుని సభా కంపంతో దిగమింగేసిన వక్తపల్ల వళ్ళు మండి పోవడం ఎంత సహజమో, ఖైమా రాతలురాసే గోడ రచయితల మీదకూడా ఆ స్థాయిలోనే వళ్ళు మండిపోవడం అంత సహజం. చాతగాకపోతే చాతకొచ్చిన వాడితో రాయించాలి. అంతేగానీ మంత్రాలయం అనే మాటలో మూడు తప్పుల చొప్పున రాసే గోడ రచయిత, వాక్యం పూర్తి చేయడానికి ఎన్ని తప్పులు రాస్తాడో మీరే అంచనా వేసుకోండి. భాషకి అన్యాయం జరగడం అటుంచండి. అసలు భాష యేమిటో బోధపడకపోతే నాలాటి గోడ పాఠకులు ఎంత చిరాకు పడిపోతారో కుంచె పట్టుకున్న పెద్దమనిషి అర్థం చేసుకోవాలి. గోడ రచయితలు దొరకడం లేదంటే ఎంత చిన్నతనమో రాయించే వాళ్ళు గ్రహించాలి!